# శ్రీమతి - స్టీలు బాసనులూ !

శ్రీ ఆర్. ప్రకాశరావు

అది ఆదివారం. ఆడిటరు ఆనందం ప్రొద్దునే అభ్యంగన మొనర్చి తృప్తిగా భోంచేసి భుక్తాయాసంతో పడక గదిలో మేను వాల్చాడు. ఆదివారం సెలవును కనిపెట్టిన మహనీయుడిని స్మరించుకుంటూ నిద్రాదేవితో ఐక్యమైపోయే సమయంలో—

"ఏమండోయి శ్రీవారు" అన్న శ్రీమతిగారి గావుకేక అతన్ని మానవ జగత్తులోకి తీసుక వచ్చింది. ప్రమీల ఒక కవరుతో గదిలోకి ప్రవేశించింది.

"ఏమండీ! మా ఫ్రెండు వాణి ఎక్స్‌ప్రెస్ డెలివరీ జాబు వ్రాసిందండి! దీంట్లో చూడండి శాంతి సర్క్యులేషను స్టెయిన్‌లెస్ స్టీలు బాసనల స్కీము. మనము ఐదు రూపాయల టిక్కెట్టు కొనుక్కొని ముగ్గురికి ఈ టిక్కెట్లు అమ్మితే యాభై రూపాయల విలువగల సామాన్లు వస్తాయి. మనము ఒకటి తీసుకొని పంపిద్దామా" అంది ప్రమీల.

"మన దగ్గర టిక్కెట్లు ఎవరు కొంటారు?"

"ఎందుకు కొనరండీ! మీకు చాలామంది తెలుసును. రోజూ కొత్త బెనిఫిట్ షో టిక్కెట్లు తగలెట్టించుకొని రావడంలేదూ! వాండ్లలో ముగ్గురికి తగలగట్టండీ!"

"బెనిఫిట్ షోకు దీనికి భేదం లేదూ! అక్కడ సినిమా కోసం కాదు టిక్కెట్టు కొనేది ఒక సంస్థ తన అభివృద్ధి కార్యాలకోసం డబ్బును ప్రోగు చెయ్యటానికి వేస్తున్న పథకం. అందుకోసం ప్రతివారు టిక్కెట్టు తప్పనిసరిగా కొనాలి" అని చిన్న లెక్చర్ యిచ్చేడు ఆనందం.

"చాల్లెండి మీ ఉపన్యాసం! యిదిమటుకు ఒక రకమైన బెనిఫిట్ షోలాంటి టిక్కెట్టు కాదా? పాపం ఆ కంపెనీవాండ్లు ప్రజారోగ్య దృష్ట్యా ప్రతి యింట్లోను స్టెయినులెస్ స్టీలు సామానులు వాడటానికి వీలుగా వుండేందుకు వేసిన పథకం. పైగా మనం ఈ వచ్చే స్టీలు సామాన్లు అన్నీ దాచివుంచి మన అమ్మాయి పెండ్లిలో చదివించవచ్చు. స్నేహితులకు పెండ్లిండ్లలోను మిగత ఫంక్షన్సులోను ప్రెజంట్సుగా యివ్వవచ్చు. యీ రకంగా స్వదేశీ సీలు బాసనలు అభివృద్ధి పరుచవచ్చు కాబట్టి మీరు ఈ టిక్కెట్టు తప్పక తీసుకోవలసిందే" అంటూ ఎదురు లెక్చరు దంచింది ప్రమీల.

"ఈ టిక్కెట్టుపైన మీ పేరు వ్రాయండి" అంటు విజయగర్వంతో మందహాసం చేస్తూ వయ్యారం వలకబోస్తూ పేనా తెచ్చింది ప్రమీల.

"నా పేరుందుకు. నీ పేరే వ్రాయి. ఈ రోజుల్లో ఆడవాళ్ళ పేరుంటేనే ఏ పనులైనా సులువుగా జరుగుతాయి. పైగా నా పేరుకంటే నీ పేరే చాలా ముద్దుగా వుంటుంది" అని ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని ఏమో చెయ్యబోతుంటే వాకిలి తలుపు "గ్రిల్సు" గలగల శబ్దం చేశాయి.

"ఏమండోయి ప్రమీలగారు" అంటూ ప్రక్కింటి పారిజాతం.

"మీవారున్నారా యింట్లో" అంటూ గుసగుసలు ప్రారంభించింది.

ఆనందానికి పట్టరానంత కోపం వచ్చింది. వారానికి ఒక్కరోజు యింట్లో సుఖంగా నిద్ర పోనివ్వరూ?

ఏం కొంప మునిగిపోయిందని యిప్పుడు ఈమెగారు రాకపోతే: బహుశా చూడడానికి 'డక్కన్ క్రానికల్' కావాలి కాబోలు. ఆదివారం వస్తే పేపరు బ్రతకనివ్వరు ఈ పక్క యింటివాండ్లు. కావలసివస్తే ఒక పేపరు కొంటే ఈమె సొమ్ము అంతా ఖర్చవుతుందా? అని అనుకుంటూ కండ్లు మూయటానికి ప్రయత్నిస్తున్నాడు ఆనందం.

పారిజాతం మాటలు హాల్లోనుంచి గట్టిగా వినబడుతున్నాయి. "మావారా వదినెగారూ! ఈ స్టీలు టిక్కెట్లలో ప్రక్క వీధి అండాళమ్మగారు ఎన్ని సామాన్లు తెప్పించిందండీ. ఒక స్టీలు క్యారియరు, రెండు జగ్గులూ, ఒక అడుపూ ఐదు గ్లాసులు, ఒక బిందె. ఇప్పుడు మల్లి తుక్కుకు వ్రాసిందట"

"మల్లి తుక్కు అంటే ఏమిటి వదినెగారు" అని ప్రశ్నించింది ప్రమీల.

"నాకు తెలియదు. అదేదో అరవపేరు. మాఆయన తనకు వచ్చిరాని అరవంతో అది దేముడికి పూలు వేసుకొనే పాత్ర అని చెప్పారు. అయినా ఆమె ఎన్ని సామాన్లు తెప్పించందండీ. ఆమె కూతురు పెండ్లికి ఒక వరుస సామాన్లు తెప్పించింది. అసలు ఇటువంటి అయిడియాస్ మనవాండ్ల కెందుకొస్తాయండి అది అరవవాండ్ల సొత్తు. మావారిని టిక్కెట్టుకొని అమ్మిపెట్టమంటే నేను అమ్మను ఫో అని కసిరికొట్టారు. సంసారం ముందుకు రావాలంటే చెరొక చెయ్యి వేస్తేకదండీ! పైగా ఏ అయిడియాస్ ఎవరికి కావాలి ఫో అని యింట్లో వుండకుండా తన స్నేహితులతో యింగ్లీషు సినిమాకి మ్యాటినీకి పోయినారు. బహుశా వారికి ఇంగ్లీషు ఐడియాలు కావాలి కాబోలు" అంటూ పారిజాతం తన గోడు వెళ్ళబోసుకొంది.

ప్రమీల పడక గదివైపు చూచి ఆనందం నిద్రపోతున్నాడని నిర్ధారణ చేసుకొని "మావారు చాలా మంచివారండి. నేను ఏది చెప్తే అది చేస్తారు" అంటూ తన భర్తమీద తనకున్న కంట్రోలును గురించి లేత సొరకాయలు కోసేసింది.

మరల 'గ్రిల్సు'గలగల. ఈసారి ప్రక్కవీధి అండాళమ్మ సాక్షాత్కారమయింది. తానేకాదు. ఆమె పిల్లలతో తను తెప్పించిన స్టీలు సామాన్లు మోయించుకొని. ఆ కంపెనీ రెప్రజెంటేటివ్‌లా వుంది. "నేనుదా ప్రక్కంటికి వస్తిని. మీకుకూడా స్టీలు బాసనులపై యింటరెస్టు వుందని పారిజాతం సొల్సియాచి. యింద సామాను పారుంగో. నేతికిదా మల్లితుక్కు వచ్చినది. ఎవళానల్ల యిరికెదో పారుంగో. ఒరు టిక్కెట్టు వాంగి కొంగో" అని అన్నది.

మల్లితుక్కు అంటే అదికూడ ఒక డబ్బాలాంటిదని అప్పుడే తెలిసింది ప్రమీలా పారిజాతాలకు. వెంటనే ఏమనుకుందో ప్రమీల అండాళమ్మ తెచ్చిన సామాన్లు అన్ని తీసుకొని ఆనందం గదిలోకి పరుగెత్తింది. మెల్లగా ఆనందం చెవిలో ఏమండి! అబ్బా చూడండి ఒక్కసారి యిలా! అమ్మో దొంగ నిద్రలా వుందే! వాళ్ళముందు నా పరువు తీయకండి" అని లేపింది. ఆనందం నిజంగా నిద్రపోతేకదా ఆమె లేపితే లేవటానికి. ఆమె బాధ ఒకపక్క ఓరచూపుతో చూస్తున్నాడు. ఆమెకు కోపం ఎక్కువగుచున్నది యింక ఆ సామాన్లు తనమీద వేసుందో అని భయం కలిగింది ఆనందానికి. వెంటనే "ఏంటి" అని బద్ధకంగా మూల్గాడు. చూడండి ఎన్ని స్టీలు సామానులు. నిజంగా ఆ సామాన్లు చూస్తుంటే వాటి ముందు వెండి సామాన్లు కూడా బలాదూరనిపిస్తున్నవి. "మనంగూడా ఈ సామాన్లు తెప్పిద్దామండి" ఊ-అన్నాడు విధిలేక ఆనందం.

ప్రమీల పరుగెత్తుకుంటూ ఆ సామాన్లు అండాళమ్మకు యిచ్చి రెండు మూడు రోజులలో టిక్కెట్టు సంగతి చూస్తామని చెప్పి పంపించింది. ఆనందం లేచాడని తెలియగానే పారిజాతం ప్రక్క యింటికి పారిపోయింది.

ఈ స్టీలు బాసనల పిచ్చి ఈ ఆడవాళ్ళకు వదిలేదెలా అని ఆనందం ఆలోచిస్తుంటే- వంటింట్లోనుంచి, కమ్మని సంగీతం ఆనందం వీనులను పరవశం చేశాయి రేడియో వంటింట్లోకి పోయిందేమోనని రేడియో టేబిల్‌వైపు చూశాడు. గుడ్ హెవన్సు! రేడియో టేబిల్‌పైననే వున్నది. ప్రమీల యింత చక్కగా పాడుతుందా! అవును సంతోషంలో తనకు తెలియకుండానే చక్కని సంగీతము పాడగలరు ఎవరైనా. బలవంతము మీద పాడినప్పుడు అది చప్పగానే వుం

టుంది. ప్రమీల పాడుతూనే ఆనందానికి యిష్టమైన ఫలహారము తీసుక వచ్చి తన చేతులతోనే తినిపించింది. కాఫీగూడా తానే త్రాపించింది. ఆ ఆనంద ఘడియలలో ఆనందం స్వర్గసోపాన లెక్కుతున్నట్లు ఫీలయినాడు.

"ఏమండీ" అన్న ప్రమీల పిలుపు ఆనందాన్ని మరల స్వర్గంలోనుంచి క్రిందికి దింపింది.

"ఏమండి ఈ టిక్కెట్టు కవరులో పెట్టి పోస్టు చేయండి యిప్పుడే!

"ఇవాళ ఆదివారం ప్రమీలా. రేపు పోస్టు చేదాములే"

"ఏందండీ. మళ్ళీ ఒకరోజు టిక్కెట్టు ఆలస్యమయిపోతుంది. ఇవాళ జి.పి.ఒ. తెరిచేవుంటుందిగా. ఆబిడ్స్ జి.పి.ఒ లో వేసిరాండి ప్లీజ్. మనకోసం మన బిడ్డల కోసం..."

"కాదు కాదు మన జాతికోసం మన దేశంకోసం"

"అబ్బా ఉండండి. మరీ ఎగతాళి అయింది. మరే ఈ కవరు ఇవాళ వేసివస్తే. మీకు తియ్యని తాయం ఇస్తాను.

"యీ కాలంలో అడ్వాన్సు యివ్వకపోతే ఎవరు పనిచెయ్యరు తెలుసా!"

"మరయితే యిలా రాండి అని అతని పెదవులపై ఒక తియ్యని ముద్దు పెట్టింది."

"యింకొకటి" అని మారాం చేశాడు ఆనందం చిన్నపిల్లాడిలా.

ఇది అడ్వాన్సు గదండీ,పోస్టు చేసి వచ్చినతర్వాత మిగతా. మావారు చాలా మంచివారు అని పాడుతూ బట్టలు తెచ్చి యిచ్చింది."

విధిలేక దేవుడా అనుకుంటూ ఆనందం ఆబిడ్సుకు పోయి జి పి ఒలో కవరు కొని శాంతి సర్క్యులేషన్‌కు కవరు వ్రాసి పంపాడు. ఈ 'శాంతి' కంపెనీ తెచ్చిన అశాంతిని తలుచుకుంటూ ఆనందం యింటివైపు పరుగెత్తాడు. కలగబోయే ఆనందాన్ని,అనుభూతిని తల్చుకుంటూ.

వారం రోజులు గడిచిపోయినాయి. ఒకరోజు ఇంటికి వెళ్ళేసరికి_

"ఏమండీ శాంతి సర్క్యులేషనుంచి పార్శిల్" వచ్చిందండీ అంటూ గంతులు వేసింది ప్రమీల.

"అప్పుడే స్టీలు సామాను వచ్చిందా ఎలా వచ్చింది ఏమి వచ్చింది అని ప్రశ్నించాడు ఆనందం."

"వి.పి.పి. పదిహేను రూపాయలకు వచ్చింది. పారిజాతం దగ్గర పైసలు తీసి కట్టేశాను. ఇందులో మూడు టిక్కెట్లున్నాయి. యివి అమ్మితే మన పదిహేను రూపాయలొస్తాయి. మనకు సామాను వస్తుంది రేపటినుంచి టిక్కెట్లు అమ్మడం మొదలుపెడ్దాము. నాకొక ఐడియా వచ్చిందండి. ఒక టిక్కెటు మా అక్కకు ఒక్కటి మీ అన్నకు పంపిద్దాము. పల్లెటూర్లో వున్నారు కదండీ ఈ లాభం వాళ్ళకు పంచివ్వద్దూ· పాపం వాళ్ళకు తెలుసో తెలియదో మరి. యిక మూడోది మీ ఆఫీసులో ఎవరికైనా అంటగట్టండి.

ఆనందం మరునాడు రెండు కవర్లు తెప్పించి ఒకటి తన అన్నకు రెండోది ప్రమీల అక్కగారికి రిజిష్టరు పోష్టులో పంపించాడు. మూడో టిక్కెట్టు కోసం ఆఫీసంతా తిరుగుతున్నాడు! అందరి దగ్గర యిది వరకే టిక్కెట్లు వున్నాయి. ఆనందం చాలా ప్రయత్నం చేశాడు. యీ ఒక టిక్కెట్టు అమ్మడానికి ఆనందాన్ని చూస్తే స్నేహితులు తప్పుక తిరిగేవాళ్ళు. టిక్కెట్టుకోసం భయపడి ఎలాగైతేనేం తన సెక్షనులో చేరిన కొత్త కుర్రాడికి అంట గట్టాడు. పది రోజుల తర్వాత ఆనందం అన్నగారి దగ్గరనుంచి ప్రమీలక్కయ్యగారి దగ్గర నుంచి టిక్కెట్లు వాపసు వచ్చినాయి. "మాదగ్గర యిదివరకే కొన్న టిక్కెట్లు అమ్ముడుపోక తంటాలు పడుతున్నాము. యీ ఫీల్డులో మీరు చాలా ఆలస్యంగా దిగారు" అని సమాధానం వచ్చింది. ఆనందం యీ రెండు టిక్కెట్లు ఆఫీసులో అమ్మలేనని ఉచ్చితంగా చెప్పాడు. పది రూపాయలు నష్టమొచ్చిందని ప్రమీల వాపోయింది. పైగా ఆమెకండకు అండాళమ్మ స్టెయిన్‌లెస్ స్టీలు సామాన్లు గదంతానింపి మధ్య కూర్చొని తన చేతకాని తనాన్ని గురించి వెక్కిరిస్తున్నట్లనుపించింది. యీ విషయం తలుచుకుంటేనే ప్రమీలకు ఒళ్ళంతా జలదరించేది.

మరొక ఆదివారం ఆనందం యింట్లో వున్నాడు. ప్రమీల మంచం మీద పండుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నది. ఆనందానికి చాల బాధ కల్గింది.

"ఎందుకు అలా బాధ పడుతున్నావు చెప్పు" అని అడిగాడు ఆనందం. వెంటనే అతని కాళ్ళమీద పడి పెద్దగా ఏడ్వడం మొదలు పెట్టింది.

పిచ్చిపిల్లా, లే, ఎందుకలా ఏడుస్తున్నావు నాతో చెప్పవూ లేకపోతే నీతో మాట్లాడను. ఊఁ...?"

"నన్ను క్షమించండి. మీకు తెలియకుండా ఒక తప్పు పని చేశానండి. యింకెప్పుడూ చేయను చెప్ప మంటారా"

"చెప్పు ఫర్వాలేదులే" అన్నాడు.

"నల్లకుంటలో ఒక స్టీలు అంగడి పెట్టారు. అక్కడ పది రూపాయలు కడ్తే వాండ్ల టిక్కెట్టు అమ్మిపెడితే మనకు స్టీలు బాసనులు యిస్తారని తెలిసింది. నేను పారిజాతరం వెళ్లాం. అక్కడ మగవారు రావటానికి వీలులేదట. ఆడవాళ్లు ఎంత మందో రెండు క్యూలలో వున్నారు పారిజాతం, నేను చెరో ఇరవై రూపాయలు కట్టినాము వారం రోజుల తర్వాత రమ్మన్నారు. వారం రోజులు కాగానే మళ్లీ వారం రోజుల తర్వాత రమ్మన్నారు. అనుకున్న రోజు పోతే అంగడి మూత. అక్కడ మనుష్యులెవ్వరూ లేరు యిరవై రూపాయలు నష్టమంటూ ఏడ్వడం ప్రారంభించింది.

"పోనీలే ప్రమీలా యింతదానికి యింత బాధ పడాలా వెధవ యిరవై రూపాయలూ పోతేపోయినయిలే మనము సుల్తాను బజారులో నెలకు పది రూపాయలు కట్టుదాము అదృష్టముంటే ప్రతినెలవేసే లాటరీలో మనకు తగలుతుంది, లేకపోతే పది నెలల తర్వాత వందరూపాయలకు సామాన్లు కొందాం.

ఈ అయిడియా బాగా నచ్చింది ప్రమీలకు అప్పటి నుంచి ప్రతినెలా పదిరూపాయలు స్టీలు అంగడిలో జమచేస్తూ వచ్చారు. తొమ్మిది నెలలు జరినాయి. వచ్చే నెలలో వందరూపాయల స్టీలు బాసనలు వస్తాయనే కోరికతో సతమతమగుచున్నది ప్రమీల యింతలోకే ఉలిగాత్రం వచ్చింది నెలాఖరులో తన చెల్లెలి పెండ్లి అని. తన ముద్దుల చెల్లెలికి కనీసం వంద రూపాయలయినా ప్రెజెంటు యివ్వాలి. ఏం కొనాలి. పైసలు ఎట్లా? పైగా నెలాఖరు తికమక పడ్డారు దంపతులిద్దరు_ పడక గదిలో ఆఖరుకు ప్రమీల ఉపాయం చెప్పింది. "వీశుండీ మన స్టీలు అంగడిలో వందరూపాయల సామాన్లు కొని అది మా చెల్లెలికి ప్రెజంటు చేస్తే సరి" అంది. "మరి మనకో" అన్నారు ఆనందం. "మళ్ళీ చీటి కడ్తే సరి" అని సమాధానం చెప్పింది ప్రమీల.

పెండ్లిలో ప్రమీల తెచ్చిన ప్రెజెంటేషనును గూర్చి మహిళా మండలిలో ప్రశంసాపత్రాలు లభించినాయి. ప్రమీల కూడా గర్వంగా ఠీవిగా తిరుగుచున్నది. అందరు తన సంగతి అనుకుంటున్నారని తెలిసి. యీ సంగతి పసిగట్టి ప్రమీల వాండ్ల వదినె ప్రమీల వంటింట్లోకి తీసుకపోయి ఆమె సేకరించిన స్టీలు పాత్రలను చూపించింది. ఆ స్టీలు పాత్రల ఎగ్జిబిషన్ చూసేటప్పటికి ప్రమీల మతి భ్రమించింది. కాని తెలివిగా ఆమెవద్ద ట్రేడుసీక్రెట్సు నేర్చుకొన్నట్లుంది. నన్ను చూడగానే ముసి ముసి నవ్వులునవ్వింది.

తిరిగి హైద్రాబాదుకు వచ్చారు. ఒక రోజు పిల్లో టాక్సులో "ఏమండీ యీ నెలలో మీ పుట్టిన రోజు వస్తున్నది కదండీ. మీరు కొత్త గుడ్డలు కుట్టించుకోండి. ఎప్పుడు చూచినా ఆ పాత షర్టులు, స్లాక్సేనా. యీసారి మీరు క్రొత్తవి నాల్గు షర్టులు నాలుగు ప్యాంట్లు కుట్టించుకోండి అని గోముగా అడిగింది.' ఆమె వ్యక్తపరిచిన అవ్యాజమైన ప్రేమ భక్తికి మురిసిపోయాడు ఆనందం.

"ఏమండి, ఈదినం అంగట్లో ఆర్డరిచ్చిరాండి లేకపోతే నేను వచ్చి ఆర్డరిప్పిస్తాను" అంది ప్రమీల.

తను వస్తాననగానే ఆనందానికి గుండె ఆగిపోయినంత పని అయింది. ప్రమీలతో కూడ బజారుకు పోవాలంటే పొడుగు పెళ్ళామని సంకోచం. అందుకని వెంటనే గుడ్డలకు ఆర్డరిచ్చాడు

"ఏమండోయ్ యివ్వాళ గుడ్డలు తెచ్చుకొనే దుకు డ్యూడేటు" తప్పక తీసుకరాండి అన్నది.

సాయంత్రము ఆనందం గుడ్డలు తెచ్చుకున్నాడు. పుట్టినరోజు ఉషారుగా నడిచింది ఆఫీసునుంచి వచ్చేటప్పటికి ప్రమీల పట్టరానిఆనందంతో స్వాగతమిచ్చింది.

"ఈరోజు ఎంత మంచిరోజండి" అంది ప్రమీల. తన పుట్టిన రోజును గురించి యింత గొప్పగా చెపుతుందికదా" అని గర్వపడ్డాడు.

రాత్రి పది గంటలయింది. పడక గది శోభనంనాటి రాత్రిలా అలంకరించింది. వస్తూనే "యివాళ గొప్ప విశేషమొకటి జరిగింది. ఏందో వూహించుకోండి?"

"నేను క్రొత్తగుడ్డ లేసుకున్నాను."

"అదికాదు. మరొక్కటి చెప్పుకోండి."

"ఏమో నాకు తెలీదు. నీవే చెప్పు విసిగించక."

"నేను ఎనిమిది స్టీలు బాసనలు కొన్నాను. అంటూ ఛెంగున లేడిలా పరుగెత్తి తను కొన్న సామాన్లన్ని చూపించింది. చిన్నచిన్న గరిటెలూ, చిన్న గిన్నెలు ప్లేట్లూ మొత్తం ఎనిమిది వస్తువులున్నాయి.

"డబ్బు ఎక్కడిదిది ప్రమీలా?"

"డబ్బా! ఫక్కున నవ్వింది కనుక్కోండి."

"పారిజాతం యిచ్చిందా."

"లేదండి. డబ్బు లేకుండానే కొన్నాను. వాడు ఊరికనే యిచ్చాడు.

"ఊరికే ఎవడిచ్చాడు అన్నాడు కోపంగా.

"మరల ఫక్కున నవ్వింది_ మీరు కొత్త గుడ్డలు కొనుక్కున్నారుగా. యింకేం మీ పాత చెక్రిలను షర్టులు,నాలుగు పాంట్లు వేశాను. వాడు పైన పైసలు యివ్వమంటే, బేరం చేసి డబ్బులు ఇవ్వకుండా కొన్నాను బాగున్నాయి కదూ!" అంది.

"చాలాబాగున్నాయి అన్నాడు. విధిలేక కాని, లోపల నాల్గువందల రూపాయల గుడ్డలకు వెధవవి నాలుగు గంటలు ప్లేట్లు కొన్నది అని లోపలచాల బాధపడ్డాడు. కాని ఆమె ఆనందానికి అంతరాయం కల్గించడానికి యిష్టంలేక రేడియో ట్యూన్ చేశాడు.

"‥ ధీరులు విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావుతన్" అన్న భర్తృహరి సుభాషితం పాడుతుంది...రేడియో. బహుశా భర్తృహరికూడా ప్రమీలబోటి వాండ్లని మనసులో ఉంచుకొని వ్రాసినట్లు మనస్సుకు సమాధాన పర్చుకున్నారు.

* * *

Telegrams : "BEIJ" Phone : 32374

ESTABLISHED 1949

SPECIALIST IN VEGETABLE SEEDS

The Deccan Seed Stores

PURSHOTTAM NIVAS

46 Basheer Bagh,

HYDERABAD-29. (A.P.)

*Dealers in :*

**vegetable and flower seeds plant protection products plant hormons & fertilizers agricultural implements sprayers, dusters and hoses**